క్యోటో ప్రొటోకాల్

1997 డిసెంబర్‌లో జపాన్ పట్టణం క్యోటోలో క్యోటో ప్రోటోకాల్‌పై సంతకాలు జరిగాయి. గ్రీన్ హౌస్ వాయువుల ను తగ్గించేందుకు ఉద్దేశించిన ఈ ప్రోటో కాల్‌పై 180 దేశాలు సంతకాలు చేశాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన 39 దేశాలు వాతావరణంలోకి గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను తగ్గించుకోవాలని క్యోటో ప్రోటోకాల్ నిర్దేశించింది.

ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్(ఐపీసీసీ) 1988లో ఏర్పాటయింది.

ఐపీసీసీ లక్ష్యాలు:

వాతావరణ వ్యవస్థ, వాతావరణ మార్పులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం.

వాతావరణ మార్పుల వల్ల ఆర్థికంగా, సామాజికంగా సంభవించే పరిణామాలపై అధ్యయనం చేయడం.

1990లో వాతావరణంపై ప్రపంచ రెండో సదస్సు జరిగింది. ఈ సదస్సు వాతావరణ మార్పులపై ముసాయిదా ఒప్పందం అవసరమని అభిప్రాయపడింది.

1992–యూఎన్ఎఫ్‌సీసీసీ:

- 1992లో బ్రెజిల్ పట్టణం రియోడి జెనిరోలో ధరిత్రీ సదస్సు నిర్వహించారు.. ఆ సందర్భంగా వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ముసాయిదా ఒప్పందంపై (యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్(యూఎన్ఎఫ్‌సీసీసీ)పై 154 దేశాలు సంతకాలు చేశాయి.

1995– (కాన్ఫరెన్స్ ఆఫ్ ద పార్టీస్(సీవోపీ–1):

- యూఎన్ఎఫ్‌సీసీసీ అత్యున్నత విభాగం సీవోపీ. దీని తొలి సదస్సు 1995లో బెర్లిన్‌లో జరిగింది. అభివృద్ధి చెందిన 35 దేశాలు గ్రీన్‌హౌస్ వాయువులను తప్పని సరిగా తగ్గించుకోవాలని బెర్లిన్ సదస్సు తీర్మానించింది.

1997–క్యోటో ప్రొటోకాల్:

- 1997 డిసెంబరులో జపాన్ పట్టణం క్యోటోలో.. గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించేందుకు ఉద్దేశించిన పత్రంపై 180 దేశాలు సంతకాలు చేశాయి.. దీన్నే క్యోటో ప్రోటోకాల్ అంటారు. యూఎన్ఎఫ్‌సీసీసీని ఆమోదించిన దేశాలన్నీ క్యోటో ప్రోటోకాల్‌ను ఆమోదించాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన 39 దేశాలు వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించుకోవాలని క్యోటో ప్రోటోకాల్ నిర్దేశించింది.

క్వెర్లోస్:

- పదిరోజుల పాటు సుదీర్ఘ సంప్రదింపులు జరిగాక క్యోటో ప్రోటోకాల్‌ను ఆమోదించారు. దీన్ని క్వాంటిఫైడ్ ఎమిషన్స్‌లిమిటేషన్ అండ్ రిడక్షన్ ఆబ్జెక్టివ్స్ (క్యూయూ ఈఎల్ఆర్‌వో(క్వెర్లోస్)గా పేర్కొన్నారు. భూతాపం సమస్య పరిష్కారానికి క్యోటో ప్రోటోకాల్ ప్రాథమిక ముసాయిదాను రూపొందించింది. దాన్ని అనుసరించి అభివృద్ధి చెందిన దేశాలు తమ ఇంధన వాడకాన్ని మూడోవంతు మేరకు తగ్గించుకోవాల్సి ఉంటుంది. భూవాతావరణంలోకి విడుదలయ్యే మొత్తం కార్బన్‌డయాక్సైడ్‌లో 17 శాతం రష్యాదే! ఈ మాజీ అగ్రరాజ్యం 2004 లో క్యోటో ప్రోటోకాల్‌ను ధ్రువీకరించింది. దాంతో ఈ ఒప్పందం అమల్లోకి రావడానికి మార్గం సుగమమైంది.

2005– క్యోటో అమలు:

- ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 180 దేశాల్లో 55 దేశాలు ధ్రువీకరిస్తేనే క్యోటో ప్రోటోకాల్ అమల్లోకి వస్తుంది.. విడుదలయ్యే మొత్తం కార్బన్‌డయాక్సైడ్‌లో ఈ 55 దేశాల వాటా 55 శాతం . 2005, ఫిబ్రవరి 16న క్యోటో ప్రోటోకాల్ అమల్లోకి వచ్చింది. మొత్తం కార్బన్‌డ యాక్సైడ్‌లో అభివృద్ధి చెందిన దేశాల వాట 61.4శాతం.

క్యోటో ముఖ్యాంశాలు:

- ఆరు గ్రీన్‌హౌస్ వాయువులను దేశాలు తగ్గించుకోవాలి.. అవి కార్బన్‌డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ యాక్సైడ్, హైడ్రోఫ్లోరోకార్బన్స్(హెచ్ఎఫీసీలు), పెర్‌ఫ్లోరో కార్బన్లు (పీఎఫ్‌సీలు), సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్(ఎస్ఎఫ్‌జీ).
- అనుబంధం 1లో ఉన్న 36 దేశాలు 2008, 2012 మధ్య కాలంలో 5.2 శాతం మేరకు గ్రీన్‌హౌస్ వాయువుల విడు దల ను తగ్గించుకోవాలి.
- 8 శాతం మేరకు తగ్గించుకునేందుకు ఐరోపా సమాఖ్య దేశాలు, 6శాతం వరకూ తగ్గించుకునేందుకు జపాన్ అంగీకరించాయి.
- గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించే ప్రాజెక్టుల రూపకల్పన దేశాలకు కార్బన్ క్రెడిట్‌లు లభిస్తాయి. ఒక కార్బన్ క్రెడిట్ లభించిందంటే... ఒక టన్ను కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాన్ని తగ్గించుకున్నట్లే!

భారత్‌పై క్యోటో ఒప్పందం ప్రభావం:

- భారత్ 2002లో క్యోటో ప్రోటోకాల్‌ను ధ్రువీకరించింది. క్యోటో ఒప్పందం అమల్లోకి రావడాన్ని భారత్ స్వాగతించింది.
- వాతావరణ సమస్యల పరిష్కారం దిశగా ఇది కీలక పరిణామమని పేర్కొంది.
- ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్న వాతావరణ సమస్యల పరిష్కారానికి క్యోటో ప్రోటోకాల్

బహుముఖ ప్రయత్నమని అభిప్రాయ పడింది.

ఆమోదించని అమెరికా:

- ఇప్పటివరకూ 175 దేశాలు క్యోటో ప్రోటోకాల్‌ను ధ్రువీకరించాయి. 2007, డిసెంబరు 3న ఆస్ట్రేలియా కూడా ఆమోదించింది. అమెరికా ప్రోటోకాల్‌పై సంతకం చేసినప్పటికీ.. ఇప్పటివరకూ ధ్రువీకరించడం కాని, ఒప్పందం నుంచి ఉపసంహరించుకోడం కానీ చేయలేదు. ప్రపంచంలో అన్నిదేశాల్లో కెల్లా అత్యధికంగా కార్బన్ డయాక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదల చేస్తోంది ఈ దేశమే! గ్రీన్‌హౌస్ వాయువుల్లో 33 శాతం, కార్బన్ డయాక్సైడ్‌లో 25 శాతం మేరకు అమెరికా నుంచి విడుదలవుతున్నాయి. క్యోటో ప్రోటోకాల్ ప్రకారం ఈ దేశం తన ఉద్గారాల్లో 7శాతం మేరకు తగ్గించుకోవాల్సి ఉంది. ప్రోటోకాల్‌ను అమెరికా ధ్రువీకరించకపోవడంపై భారత్ సహా పలు దేశాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ఒప్పందాన్ని ధ్రువీకరించకుండా అమెరికా ఒకరకంగా వాతావరణ సమస్య పరిష్కారానికి అడ్డుపడుతోందనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తంచేస్తున్నారు.

అమెరికా చెప్పే కారణాలు:

- క్యోటో ప్రోటోకాల్‌లో లోపాలున్నాయని అమెరికా చెబుతోంది. 80 శాతం ప్రపంచాన్ని ఈ ఒప్పందం నుంచి మినహాయించారని, ఇది సరైంది కాదని ఆ దేశ అధ్యక్షుడు జార్జిబుష్ పేర్కొన్నారు. క్యోటో ప్రోటోకాల్‌ను అమలు చేస్తే తమ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో పడుతుందన్నారు.

క్యోటోతో భారత్‌కు లాభాలు:

- నిర్దేశిత శాతం మేరకు గ్రీన్‌హౌస్‌వాయువులను తగ్గించు కోవాల్సిన దేశాల జాబితాలోంచి భారత్‌కు మినహాయింపు లభించింది.
- ఇప్పుడిప్పుడే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నందున తమ ఇంధన విధానాలను మార్చుకుంటే.. ఆర్థిక వ్యవస్థపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని భారత్, చైనా తదితర దేశాలు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ మినహాయింపు లభించింది.
- ప్రోటోకాల్ మొదటి దశలో 2012 వరకూ.. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించుకోవాల్సిందిగా భారత్‌పై ఎలాంటి నిబంధనా లేదు.
- ప్రోటోకాల్‌ను ధ్రువీకరించడం వల్ల ఇతర దేశాల నుంచి భారత్‌కు పర్యావరణ అనుకూల టెక్నాలజీ లభించే అవకాశముంది.

క్యోటో..

జపాన్‌లోని ఒక పట్టణం. దీని జనాభా దాదాపు 15లక్షలు. 1997లో వాతావరణ సమస్యలపై ఇక్కడ సదస్సు జరిగింది. ఆ సదస్సు ఆమోదించిన ఒప్పందం క్యోటో ప్రోటోకాల్‌గా ప్రచారం పొందింది. ఇక్కడ విరబూసే రకరకాల పుష్పాలు క్యోటోను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మార్చేశాయి.